కులగణన వెంటనే చేపట్టాలి

- ఆర్ కృష్ణయ్య డిమాండ్

హైదరాబాద్, జూలై 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వెంటనే కుల గణన చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య డిమాండ్ చేశారు. పంచాయతీరాజ్ ఎన్నికలపై సీఎం ప్రత్యేకంగా సమీక్షించిన నేపథ్యంలో కృష్ణయ్య స్పందించారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచాలని, ఆ తర్వాతే సానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెంచకుండా ఉండేందుకు ప్రభుత్వం సాకులు వెతుకుతున్నదని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లోక్‌సభలో బీసీ రిజర్వేషన్లు పెంచుతూ ప్రైవేట్ బిల్లు పెడితే దాదాపు అన్నిపార్టీల మద్దతు లభిస్తుందని, అందుకు కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ చొరవ తీసుకోవాలని కోరారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా స్థానిక ఎన్నికలను నిర్వహిస్తే, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు.

కులగణన చేయకుండా కాంగ్రెస్ కుట్ర

- బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్

హైదరాబాద్, జూలై 26 (నమస్తే తెలంగాణ): కులగణన చేయకుండా, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండానే స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలకు తెరలేపిందని బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాంయాదవ్ ఆరోపించారు. స్థానిక ఎన్నికలపై సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో వివిధ బీసీకుల సంఘాల అధ్యక్షులు, ప్రతినిధులతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతరం ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీలను రాజకీయాలకు దూరం చేయడమే లక్ష్యంగా రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో దేశ్‌ముఖ్‌ల పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుంటే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రయత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వరులు, అడ్వకేట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు లొడంగి గోవర్ధన్, తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్, తెలంగాణ బీసీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనంతుల రామ్మూర్తిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బీసీలను మోసగించిన కాంగ్రెస్

- బీసీ కమిషన్ మాజీ సభ్యుడు జూలూరు గౌరీశంకర్

హైదరాబాద్, జూలై 26 (నమస్తే తెలంగాణ): బీసీ కులగణన చేస్తామని, స్థానిక రిజర్వేషన్లు పెంచుతామని చెప్పిన కాంగ్రెస్ మోసం చేసిందని తెలంగాణ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు జూలూరు గౌరీశంకర్ వెల్లడించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు పోవడం చూస్తుంటే కాంగ్రెస్ పార్టీ బీసీలను ఎంత మోసం చేసిందో అవగతమవుతున్నదని మండిపడ్డారు.

బీసీలకూ సబ్‌ప్లాన్ అమలు చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, జూలై26 (నమస్తే తెలంగాణ): కేంద్ర సర్కారు బడ్జెట్‌లో బీసీలకు మొండిచేయి చూపిందని, రాష్ట్ర బడ్జెట్‌లోనూ మరిన్ని నిధులను కేటాయించాల్సి ఉందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సచివాలయం వద్ద శుక్రవారం మాట్లాడుతూ రాహుల్ మాటకు విలువనిచ్చి కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

30 నుంచి బడి పిల్లలకు 'తిథి భోజనం'

- మధ్యాహ్న భోజనంలో కొత్త కార్యక్రమం
- తెలంగాణ సోయి లేకుండా పేరు పెట్టిన విద్యా శాఖ
- అశుభ దినాలను సూచించే పదమని టీచర్లు, పేరెంట్స్ ఆగ్రహం
- తక్షణమే పేరు మార్చాలని ఉపాధ్యాయ సంఘాల డిమాండ్
- ఇది కేంద్రం పెట్టిన పేరంటూ సమర్థించిన విద్యాశాఖ డైరెక్టర్

హైదరాబాద్, జూలై 26 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఏమాత్రం సోయిలేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ఒక పేరు తీవ్ర వివాదస్పదమైంది. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ఈ నెల 30 నుంచి పాఠశాలల్లో 'తిథి భోజనం' అనే కొత్త కార్యక్రమం ప్రారంభించాలని, ఇందుకు తగిన ఏర్పాట్లు చేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నరసింహారెడ్డి శుక్రవారం డీఈవోలకు ఆదేశాలు జారీ చేశారు. 'తిథి భోజనం'లో భాగంగా పిల్లలకు పౌష్టికాహారం, ఆరోగ్యవంతమైన ఆహారాన్ని అదనపు ఆహార పదార్థంగా అందించాలని ఆదేశించారు. పాఠశాలలవారీగా కమ్యూనిటీ సభ్యులు ప్రత్యేక సందర్భాల్లో లేదా పండుగ రోజుల్లో అదనపు పదార్థంగా, పూర్తి భోజనంగా స్వీట్లు, పండ్లు, నామ్‌కీన్ వంటి రూపాల్లో అందించాలని సూచించారు. అయితే, పండుగలు లాంటి ప్రత్యేక సందర్భాల్లో బడి పిల్లలకు పెట్టే భోజనానికి 'తిథి భోజనం' అనే పేరు పెట్టడం పట్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చనిపోయినవారికి ఏడాదికోసారి పెట్టే తద్దినాన్ని 'తిథి' అంటారనే కనీస సోయి లేకుండా బడి పిల్లలకు పెట్టే భోజనానికి 'తిథి భోజనం' అనే పేరు పెట్టడమేమిటని తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. అశుభ దినాలకు ఉద్దేశించిన పదాన్ని బడి పిల్లల భోజనానికి పెట్టడం తగదని, మరో పేరు నిర్ణయించాలని పలువురు విజ్ఞులు సూచిస్తున్నారు. చివరకు వామపక్ష భావజాలం ఉన్న యూటీఎఫ్ టీఎస్ రాష్ట్ర నాయకుడు చావ రవి కూడా 'తిథి భోజనం' అనే పేరు పెట్టడం సమంజసం కాదని, ఈ పేరును తక్షణమే మార్చాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధుల నుంచి కూడా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం సానుకూలంగా స్పందించడం లేదు. ఈ పేరును కేంద్ర ప్రభుత్వం పెట్టిందని, ఇది సంస్కృత పదమని, దీనికి మంచి అర్థమే ఉన్నదని, ఈ పేరు పట్ల అభ్యంతరాలు పెట్టాల్సిన అవసరం ఉండకపోవచ్చని సమర్థించుకుంటున్నారు. తిథి భోజనం వల్ల పాఠశాల, స్థానిక ప్రజల మధ్య సత్సంబంధాలను పెంపొందిస్తుందని, అన్ని వర్గాల పిల్లల్లో సమానత్వ భావన కలుగడానికి సహాయపడుతుందని విద్యాశాఖ డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సప్లిమెంటరీ న్యూట్రిషన్ల ద్వారా 'తిథి భోజనం' పాఠశాల పిల్లల రోగ నిరోధక శక్తిని బలోపేతం చేయడానికి దోహదపడుతుందని తెలిపారు. 'తిథి భోజనం' అమలు కోసం తిథి భోజన కార్యక్రమాన్ని జియోట్యాగ్ చేసిన ఫోటోలు కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన గూగుల్ డ్రైవ్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పీఎం పోషణ్' కార్యక్రమంలో భాగంగా 'తిథి భోజనం' అమల్లోకి తీసుకొస్తున్నట్టు వెల్లడించారు.



శిక్షణలో ప్రతిభ చూపినవారికి బహుమతి అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

90 రోజుల్లో మరో 30వేల ఉద్యోగాలు

- నిరుద్యోగులూ.. సమస్యలపై మంత్రులను కలవండి
- ఫైర్‌మెన్ పాసింగ్‌ఔట్ పరేడ్‌కు ఆలస్యంగా సీఎం
- సొమ్మసిల్లి పడిపోయిన కొత్త ఫైర్‌మెన్

హైదరాబాద్, జూలై 26 (నమస్తే తెలంగాణ): రానున్న 90 రోజుల్లో 30 వేల ఉద్యోగ ఖాళీలను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయనున్నదని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం వచ్చిన 90 రోజుల్లోనే 30 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చామని తెలిపారు. 2022 నోటిఫికేషన్‌లో ఫైర్‌మెన్‌లుగా అర్హత సాధించి, నాలుగు నెలలు శిక్షణ పూర్తిచేసుకున్న 483 మంది ఫైర్‌మెన్‌లకు శుక్రవారం వట్టినాగులపల్లిలోని ఫైర్ ట్రైనింగ్ అకాడమీలో దీక్షాంత్ పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు మంచి చేయడానికి, ఒకటో తేదీన జీతాలు ఇవ్వడానికి తమ ప్రభుత్వానికి ఎలాంటి భేషజాలు లేవని చెప్పారు. సకలజనులకు మంచి చేయాలనే ఉద్దేశంతోనే రూ.2.91 లక్షల కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్టు తెలిపారు. ఫైర్‌మెన్‌లను ఉద్దేశించి మాట్లాడుతూ.. జీతభత్యాల కోసం కాకుండా.. ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకు తమ ప్రాణాలను పణంగా పెట్టేందుకు ఫైర్‌మెన్ జాబ్‌లోకి వచ్చిన అభ్యర్థులను అభినందించారు. ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీకి తగిన ప్రణాళిక తమ వద్ద ఉన్నదని రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. పాసింగ్ ఔట్ పరేడ్‌కు ముఖ్యమంత్రి ఆలస్యంగా రావడంతో అభ్యర్థులు ఒక్కొక్కరుగా సొమ్మసిల్లి పడిపోయారు. కానిస్టేబుళ్లు వారికి సపర్యలు చేసి, మళ్లీ పరేడ్‌లోకి తీసుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతుండగానే మరో ఇద్దరు అభ్యర్థులు సొమ్మలిసిల్లి పడిపోవడంతో.. అంబులెన్స్ పిలిపించి వారికి వైద్యం చేయించమని సీఎం సభావేదిక నుంచే ఆదేశించారు. దీంతో అభ్యర్థులు, వారి తల్లిదండ్రుల్లో అసహనం వ్యక్తమైంది.

ఇదంతా కేసీఆర్ సార్ క్రెడిటే

2022లో పోలీస్ కానిస్టేబుళ్లతోపాటు తమకు కూడా నాటి సీఎం కేసీఆర్ నోటిఫికేషన్ ఇచ్చారని ఫైర్‌మెన్‌లు చెప్పారు. ఆయన హయాంలో వివిధ దశల్లో పరీక్షలు జరిగాయని, అయితే కోర్టు కేసుల వల్ల తమ తుది ఫలితాల విడుదల ఆలస్యమైందని అన్నారు. అప్పుడే ఎలాంటి కోర్టు చిక్కులు లేకుండా ఫలితాలు వచ్చి ఉంటే.. ఈ ఉద్యోగాల క్రెడిట్ అంతా కేసీఆర్ సార్‌కే దక్కేదని పలువురు అభ్యర్థులు 'నమస్తే తెలంగాణ'తో చెప్పారు. అవి ఆల స్యం కావడం వల్లనే కొత్త ప్రభుత్వంలో తమకు నియామకపత్రాలు వచ్చాయని అన్నారు.

ఇప్పట్లో 'స్థానికం' సాధ్యమా?

- బీసీ కమిషన్ నివేదిక ఇవ్వనే లేదు
- ట్రిపుల్ పరీక్షను ప్రారంభించనే లేదు
- కులగణన జరిగే అవకాశం లేనేలేదు
- ఏ ప్రాతిపదికన రిజర్వేషన్లు ఖరారవుతాయి
- సీఎం సమీక్ష వెనుక రాజకీయ వ్యూహం
- రాజకీయ పరిశీలకుల అభిప్రాయం

హైదరాబాద్, జూలై 26 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల ఎన్నికలు సమీప భవిష్యత్తులో జరిగే అవకాశం లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహించిన నేపథ్యంలో.. ఆగస్టులో ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్నదన్న ప్రచారం సోషల్ మీడియాలో ప్రారంభమైంది. స్థానిక ఎన్నికల నిర్వహణకు ముందు సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాల్సి ఉన్నదని, కుల గణన జరగాలని, బీసీ కమిషన్ నివేదిక రావాలని, ఇవన్నీ కాకుండా చట్టపరమైన చిక్కులు ఎదురుకాకపోయినా వచ్చే ఒకటి రెండు నెలల్లో ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాకపోవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం 2019లో స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమైన సమయంలో సుప్రీంకోర్టు షరతులు విధించింది. బీసీల రిజర్వేషన్‌ను ఖరారు చేయడానికి నియమించిన కమిషన్ ట్రిపుల్ టెస్ట్ ద్వారా నివేదిక ఇవ్వాలి. ఆ తరువాతనే బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికలు నిర్వహించాలని స్పష్టంగా సూచించింది. కానీ బీసీ కమిషన్ ఇంతవరకు కూడా ట్రిపుల్ టెస్ట్‌కు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించలేదు. ఈ ప్రక్రియ పూర్తికావడానికి కొన్ని నెలల సమయం పడుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరోవైపు బీసీ రిజర్వేషన్ల ఖరారుకు ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకుంటే న్యాయపరమైన చిక్కులు వస్తాయని, జనాభాను ప్రాతిపదికగా తీసుకోవాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు.

కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా..

ఇటీవలే బీహార్‌లో కులగణన చేసి రిజర్వేషన్లను 65 శాతానికి పెంచారు. రిజర్వేషన్లు రాజ్యాంగం నిర్దేశించిన 50శాతం కన్నా అధికంగా ఉన్నాయంటూ ఈ నిర్ణయాన్ని ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. దీంతో తెలంగాణలో కూడా కులగణన చేసినా ఇప్పటికే ఎస్సీ, ఎస్టీలకు కలిపి 25 శాతం రిజర్వేషన్లు ఉన్న నేపథ్యంలో బీసీలకు మరో 25 శాతం తప్ప అంతకన్నా ఎక్కువగా ఇవ్వడానికి వీలులేదని న్యాయ నిపుణులు చెప్తున్నారు. దీంతో ప్రభుత్వం కులగణనను పక్కకు పెట్టినట్టుగా భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా 42 శాతం రిజర్వేషన్లను ఏ విధంగా అమలు చేయనున్నదనే విషయం ఆసక్తిగా మారింది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం సైతం జనగణన చేయడంలేదు. కేంద్ర బడ్జెట్‌లో ఇందుకు నిధులు కేటాయించకపోవడమే నిదర్శనం.

వివాదాలు

బీసీ కమిషన్ ట్రిపుల్ టెస్ట్ ఆధారంగా ఇచ్చే నివేదికపై అభ్యంతరాలు, వివాదాలు తలెత్తవచ్చని, వాటిపై ఎవరైనా కోర్టుకు వెళ్లే అవకాశాలు ఉంటాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. గతంలో అనేక సందర్భాల్లో స్థానిక సంస్థల ప్రక్రియపై కోర్టుకు వెళ్లిన ఉదంతాలను వారు ఉదహరిస్తున్నారు. ఈ అడ్డంకులన్నీ అధిగమించడానికి ఎంత సమయమైనా పట్టవచ్చని అంటున్నారు.

లోక్‌సభ ఎన్నికల జాబితాతో

స్థానిక సంస్థల ఎన్నికలకు లోక్‌సభలో వినియోగించిన ఓటరు జాబితాను ప్రాతిపదికగా తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ ప్రక్రియలో మొదట గ్రామ పంచాయతీ ప్రాతిపదికన ఓటరు జాబితాను ఖరారు చేస్తారు. దీనికి ప్రామాణికంగా లోక్‌సభ ఎన్నికల ఓటరు జాబితాను తీసుకుంటున్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ విజ్ఞప్తిమేరకు కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల ఓటరు జాబితాను ఇచ్చేందుకు అంగీకరించింది. అది వచ్చిన తరువాత పంచాయతీల వారీగా ఓటరు జాబితాను ఖరారు చేస్తారు.

చేరికల కోసమే సీఎం వ్యాఖ్యలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లోక్‌సభ ఎన్నికల సమయంలో జూన్‌లోనే స్థానిక సంస్థల ఎన్నికలంటూ ప్రకటించారు. జూన్, జూలై నెలలు ముగియనున్నాయి. కానీ ఇంతవరకు ఎన్నికలకు ముందుడుగు పడలేదు. తాజాగా ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలంటూ అధికారులను ఆదేశించారు. దీని వెనుక రాజకీయ లబ్ధి, ఇతర పార్టీల నుంచి చేరికలను ప్రోత్సహించేందుకే ముఖ్యమంత్రి అధికారులను తొందరపెడుతున్నారని పరిశీలకులు చెప్తున్నారు.

స్థానిక ఎన్నికల ప్రక్రియ వేగవంతం చేయండి

మొదటిపేజీ తరువాయి...

సంఘానికి (ఎస్ఈసీ) కొత్త ఓటర్ల జాబితా రావాల్సి ఉన్నదని అధికారులు తెలిపారు. ఇప్పటికే రెండు రాష్ట్రాలకు ఈసీఐ జాబితా పంపిందని, మనతోపాటు మరో ఆరు రాష్ట్రాలకు మరో వారంలో జాబితాలు పంపనున్నదని చెప్పారు. జాబితా వచ్చినవెంటనే ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వారంలోపే ఆయా స్థానిక సంస్థలకు తగినట్లు ఓటర్ల జాబితాలు రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. రిజర్వేషన్లకు సంబంధించి బీసీ కమిషన్ సైతం నిర్దిష్ట గడువులోగా తమ నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ధరణిపై ప్రజల నుంచి సలహాలు

ధరణితో తలెత్తుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం మరింత లోతుగా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. సీఎం ధరణి సమస్యలపై సమీక్ష నిర్వహించారు. భూ సమస్యలు నానాటికీ ఎక్కువవుతుండటంతో సమగ్ర చట్టం రూపొందించాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. ఒకప్పుడు గ్రామ స్థాయిలోనే రికార్డులు అందుబాటులో ఉండేవని గుర్తుచేశారు. చట్టాల మార్పుతో క్రమంగా మండలకేంద్రానికి, తర్వాత జిల్లా కేంద్రానికి, రాష్ట్రస్థాయికి రికార్డులు వెళ్లిపోయాయని అన్నారు. గతంలో భూ సమస్యల పరిష్కారానికి అప్పీలు చేసుకొనే అవకాశం ఉండేదని గుర్తు చేశారు. ధరణితో గ్రామ, మండలస్థాయిలో ఏ సమస్యకు పరిష్కారం లేకుండాపోయిందని, సమస్త అధికారాలు జిల్లా కలెక్టర్‌కు అప్పజెప్పారని పేర్కొన్నారు. అక్కడ కూడా సమస్య పరిష్కారం కావడం లేదని, కలెక్టర్లు తీసుకొనే ఏ నిర్ణయాన్ని ప్రశ్నించే అవకాశం లేకుండా ధరణిని రూపొందించారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో భూ సమస్యల పరిష్కారానికి విస్తృత స్థాయి సంప్రదింపులు చేపట్టాలని, ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించాలని సీఎం సూచించారు

అఖిలపక్ష భేటీ

ధరణి విషయంలో అఖిలపక్ష భేటీ ఏర్పాటుచేసి అందరి అభిప్రాయాలతో సమగ్ర చట్టం తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భూదాన్, పోరంబోకు, బంచరాయి, ఇనాం, కాందిశీకుల భూముల సమస్యలున్న ఓ మండలాన్ని ఎంపిక చేసుకొని, అక్కడ ఎదురవుతున్న సమస్యలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక రూపొందిస్తే ఆ సమస్యలపైనా పూర్తి స్పష్టత ఏర్పడుతుందని తెలిపారు. అవసరమైతే వీటన్నింటిపై శాసనసభలో చర్చ చేసి తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశాల్లో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు దామోదర రాజనరసింహ, సీతక్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ధరణి కమిటీ సభ్యులు కోదండరెడ్డి, సునీల్‌కుమార్, రేమండ్ పీటర్, మధుసూదన్, సీసీఎల్ఏ నవీన్‌మిట్టల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సీఎం ముఖ్యకార్యదర్శి వీ శేషాద్రి, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, వేముల శ్రీనివాసులు, సంగీత సత్యానారాయణ, అజిత్‌రెడ్డి, అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

'చేనేత'కు ఉపాధి కల్పించాలి

- అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని హ్యాండ్లూమ్స్, పవర్‌లూమ్ కార్మికులకు ఉపాధి కల్పించాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. తెలంగాణ హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ (టీజీసీవో) అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఆర్టీసీ, పోలీస్, హెల్త్ విభాగాల్లోనూ ప్రభుత్వ సంస్థల నుంచే వస్త్రం కొనుగోలు చేసేలా చూడాలని ఆదేశించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎండీ శైలజ రామయ్యర్ పాల్గొన్నారు.

జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు షూ పంపిణీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి సీఎంను కలిసి నిధుల మంజూరుపై కృతజ్ఞతలు తెలిపారు.

'ఆర్టీసీ' ఆశలు ఆవిరి

- బడ్జెట్‌లో మహాలక్ష్మి పథకం అమలుకే సరి
- సంస్థ విస్తరణ, బస్సుల కొనుగోలు ఊసేలేదు
- కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలపై లేని ప్రస్తావన

హైదరాబాద్, జూలై 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర బడ్జెట్‌లో తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఉద్యోగులు పెట్టుకున్న ఆశలు నీరుగారాయి. వేలాది మంది ఆర్టీసీ కార్మికులు ఎదురుచూస్తున్న అపాయింటెడ్ తేదీ, కొత్త బస్సుల కొనుగోలు వంటి కీలక అంశాలపై ఎలాంటి ప్రస్తావన లేకపోవడంతో వారు నిరుత్సాహానికి గురవుతున్నారు. మొత్తం బడ్జెట్‌లో మూడు శాతం నిధులు కేటాయించాలన్న కార్మిక సంఘాల డిమాండ్‌ను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని కార్మిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మహాలక్ష్మి స్కీం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యానికి మాత్రమే రీయింబర్స్‌మెంట్ కింద నిధులను కేటాయించింది. 2023 డిసెంబర్ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు నాలుగు నెలల సొమ్ము 2023-24 ఆర్థిక సంవత్సర బడ్జెట్ కేటాయింపుల్లో చేరింది. 2024 ఏప్రిల్ 1 నుంచి మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ లెక్కలు కూడా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోకే వస్తాయి. అంటే ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు అమల్లో ఉండే మహాలక్ష్మికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది కేవలం రూ.3,082 కోట్లు మాత్రమే. ఆర్టీసీ విస్తరణ, కొత్త బస్సుల కొనుగోళ్లకు ప్రత్యేకంగా ఎలాంటి నిధులు ఇవ్వలేదు. వివిధ రకాల బకాయిలకూ ఎలాంటి కేటాయింపులు లేవు. వేతన సవరణ ఊసే లేదు. ఆర్టీసీకి ప్రభుత్వ గ్యారెంటీ లేని రుణాల ఔట్‌స్టాండింగ్ 2024 మార్చి 31 నాటికి రూ.1,131.55 కోట్లు ఉన్నట్టు బడ్జెట్ లెక్కల్లో పేర్కొన్నారు. వీటిని ఆర్టీసీయే చెల్లించాల్సి ఉంటుంది.

'మాఫీ' మాయ!

- లక్షలోపు రుణమాఫీ గందరగోళం
- ప్రచార ఆర్భాటమే ఎక్కువ
- ఆందోళనలో రాఘవాపూర్ రైతు

సిద్దిపేట/సిద్దిపేట రూరల్, జూలై 26 : లక్ష లోపు పంట రుణమాఫీ రాష్ట్రంలోని రైతులందరికీ పూర్తయిందని, అందుకు నిధులు ఆయా బ్యాంకులకు జమ చేశామంటూ జాబితాను ప్రభుత్వం హడావిడిగా ప్రకటించింది. తీరా రైతులు బ్యాంకులకు వెళ్లి రుణ ఖాతాలను తనిఖీ చేసుకుంటే మాఫీ కాలేదని తేలడంతో వ్యవసాయశాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్‌కు చెందిన దగ్గుల రాజు అనే రైతు ఎస్‌బీఐలో రూ.63,800 పంట రుణం తీసుకున్నాడు. మొదటి విడత లక్ష లోపు రుణం మాఫీ అయినట్టు తెలుసుకొని బ్యాంకుకు వెళ్లగా కాలేదని తెలుసుకుని కంగుతిన్నాడు. పంట రుణాన్ని బ్యాంకు నిబంధనల మేరకు రెన్యువల్ కూడా చేయించానని, అయినా రుణం మాఫీ కాలేదని సదరు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. రాఘవాపూర్ రైతు సమస్యను 'నమస్తే తెలంగాణ' వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా మరో జాబితాలో మాఫీ చేయిస్తామని చెప్పారు. ఈ జాబితాలో ఎందుకు కాలేదనే విషయం చెప్పలేకపోయారు.

కేసీఆర్ ఉన్నప్పుడు మాఫీ అయ్యింది..

నాకు రాఘవాపూర్‌లో ఎకరం నాలుగు గుంటల పొలం ఉన్నది. 2013లో నర్సాపూర్ చౌరస్తాలోని ఎస్‌బీఐలో క్రాప్ లోన్ తీసుకున్న. అప్పటి నుంచి మిత్తి కట్టి రెన్యువల్ చేసుకుంటున్న. 10 మే 2023న రెన్యువల్ చేసుకున్న. లోన్ మొత్తం 63,800 అయింది. ప్రభుత్వం లక్షలోపు లోన్ ఉన్న వారికి క్రాప్ లోన్ మాఫీ చేసిందని తెలిసి బ్యాంకుకు పోయిన. లిస్టులో నాపేరు లేదట. లక్షలోపు లోన్ ఉన్నోళ్లకు మాఫీ చేస్తే నా అప్పు మాఫీ కావాలె. కేసీఆర్ గవర్నమెంట్ల పోయినసారి రూ.30 వేలు మాఫీ అయింది. ప్రతి పంటకు మాకు రైతుబంధు వేసిండు. కాంగ్రెస్ ప్రభుత్వం నాకు రుణమాఫీ చేసి ఆదుకోవాలి

-దగ్గుల రాజు, రాఘవాపూర్, సిద్దిపేట జిల్లా

మేమేం పాపం చేశాం?

- బ్యాంక్ మేనేజర్‌ను నిలదీసిన కన్నాపూర్ ర